# సత్యవాక్కు

# THE WORD OF TRUTH



## క్రైస్తవ మాసపత్రిక

AUGUST 2006

సంవత్సర చందా రూ. 50/-

**సత్యవాణి ఇప్పుడు 'విస్టా' ఛానెల్ లో కూడ**

**ప్రతి గురువారం ఉదయం 7:00 గం॥**

**నుండి 7:30 గం॥ల వరకు చూడండి.**

**క్రీస్తు సంఘములు సమర్పించుచున్న**

**సత్యవాణి టి.వి. కార్యక్రమములను**

| | | |
|---|---|---|
| ప్రతి మంగళవారం | : | ఉదయం 630 గం॥లకు 'మా' టి.వి. లోను |
| ప్రతి గురువారం | : | 'విస్టా' ఛానల్ లో ఉదయం 7:00 గం॥లకు |
| ప్రతి శుక్రవారం | : | KTV లోను, IN కేబుల్ లో ఉదయం 7:00 గం॥ లకు, సాయంత్రం 530 గం॥లకు (కాకినాడ లో మాత్రమే) |
| ప్రతి శనివారం | : | ఉదయం 630 గం॥లకు 'తేజ' ఛానల్ లోను చూడండి |
| ప్రసంగీకులు | : | బ్రదర్. జాషువా గౌతం<br>బ్రదర్. లక్ష్మీ గౌతం |

**సత్యమువార్తను వినండి !!**

**మీ బంధు మిత్రులకు వినిపించండి !!**

# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

P.O. Box - 80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి 27 | ఆగస్టు 2006 | సంచిక 1


## బైబిలును గూర్చి నీ వేమనుకొనుచున్నావు ?
## (What think ye of the Bible ?)

బైబిలునుగూర్చి నీ వేమనుకొను చాన్నావు?? ఆ గ్రంధము అనేక వందల సంవత్సరముల నుండి మన యొద్ద ఉన్నది గదా. దానిని గూర్చి నీ ఉద్దేశ్య మేమి?? అది ఎక్కడ నుండి వచ్చినది? లేక యెవరి వలన కలిగినది? అందున్న సంగతులు కొన్ని సత్యములు, కొన్ని అసత్యములునని కొందరు అందురు. మరి కొందరు ప్రఖ్యాత కవులు వ్రాసిన గ్రంధములవలె బైబిలు కూడా వ్రాయబడెనని అందురు. కొందరయితే బైబిలును వ్రాయువారి తలంపులనే దేవుడు ప్రేరేపించెను గాని ఆ మనుష్యులు తమ సొంతమాటలనే వ్రాసిరియని భావింతురు. నమ్మకమ యిన ప్రతి క్రైస్తవుడుఅయితే అది నూటికి నూరుపాళ్ళు దేవుని వాక్యమని, అందున్న సంగతులను దేవుడు బయలుపరచగా దేవుని ఆత్మ ప్రేరేపణ చొప్పున ఆ లేఖకులు అక్షరాంశరరీతిగా బైబిలును వ్రాసిరి యని విశ్వసింతురు. వచ్చే కొద్ది సంచికల లోను బైబిలును

మనము పరిశోధిస్తూ, ఆ గ్రంథము దేవుని వాక్యమో లేక మానవ కల్పితమో నిర్ణయించుదము. మన పరిశోధనలో ఈ దిగువ ప్రశ్నలకు జవాబులను కనుగొనుటకు ప్రయత్నిం చెదము:

పరిశుద్ధ లేఖనములలో పరిశుద్ధాత్ముడు ఉన్నాడా ? అయితే బైబిలు గ్రంథము ఎందును బట్టి, లేక ఎంతమట్టుకు దేవుని వాక్యమై యున్నదని ఆరోపించుకొనచున్నది? ఆధునిక విజ్ఞానశాస్త్ర సంగతులు బైబిలుతో సమైక్యత జెందుచున్నావా? లేక బైబిలునకు విరుద్ధముగా కనుగొనబడిన సంగతులేవైనను ఉన్నవా? బైబిలు గ్రంథము చారిత్రాత్మకముగా సత్యమేనా? అందు వ్రాయబడిన చారిత్రక సంగతులు సత్యమేనా? అందున్న వందలకొలది ప్రవచనముల సంగతి యేమి? సాధారణ మానవులు భవిష్యత్తులో జరగబోయే సంగతులను వందల, వేలకొలది సంవత్సరములకు ముందే ఖచ్చితముగా ప్రవచించగలరా? పురావస్తు శాస్త్ర ప్రకారము బైబిలు యధార్ధమా? భౌగోళికముగాను, భూగర్భ శాస్త్రప్రకారము బైబిలు యధార్ధమా?

ఇంతకీ జ్ఞానము కలిగిన మనుష్యులందరు బైబిలును ఒకే రీతిగ అర్ధము చేసికొనగలరా? అట్లయిన క్రైస్తవలోకమంతయును నేడు వందలకొలది డినామినేషనులవలె విభజింపబడి యున్నది. ఎందు వలన? ఇట్టి ప్రశ్నలకు మనము జవాబును కనుగొనిన యెడల బైబిలు గ్రంథము దైవగ్రంథమో లేక మానవ కృతమో మనము గ్రహించుకొన వచ్చును.

బైబిలు అయితే తనకు తానే దేవుని వాక్యమని చెప్పుకొనుచున్నది. భక్తుడైన పేతురు ఇట్లు చెప్పుచున్నాడు: "ఏలయనగా చమత్కారముగా కల్పించిన కథలను అనుసరించి మన ప్రభువైన యేసు క్రీస్తు యొక్క శక్తిని, ఆయన రాకడను మేము మీకు తెలుపలేదు గాని ఆయన మహాత్మనమును మేము కన్నులారా చూచినవారమై తెలిపితిమి. ఈయన నా ప్రియ కుమారుడు, ఈయన యందు నేను ఆనందించుచున్నాను అను శబ్దము మహా దివ్య మహిమ నుండి ఆయన యొద్దకు వచ్చినప్పుడు, తండ్రియైన దేవుని వలన ఘనతయు, మహిమయు ఆయన పొందగా, మేము ఆ పరిశుద్ధ పర్వతము మీద ఆయనతో కూడ ఉండినవారమై, ఆ శబ్దము

ఆకాశము నుండి రాగా తెల్లవారి వేకువచుక్క మీ హృదయములలో ఉదయించువరకు ఆ వాక్యము చీకటి గల చోటున వెలుగిచ్చు దీపమైనట్టున్నది; దానియందు మీరు లక్ష్యముంచిన యెడల మీకు మేలు. ఒకడు తన ఊహనుబట్టి చెప్పుటవలన లేఖనము లలో ఏ ప్రవచనమును పుట్టదని మొదట గ్రహించుకొనవలెను. ఏలయనగా ప్రవచనము ఎప్పుడును మనుష్యుని ఇచ్ఛనుబట్టి కలుగలేదు గాని మనుష్యులు పరిశుద్ధాత్మవలన ప్రేరేపింప బడినవారై దేవుని మూలముగ పలికిరి" (2 పేతు 1:16-21).

**బైబిలు వ్రాయబడిన విధమిది:** మనుష్యులు దేవుని మూలముగ పలికిరి; వారు పరిశుద్ధాత్మచే ప్రేరేపింపబడిన వారై పలికిరి. పాతనిబంధన గ్రంధ మంతయు, నూటికి నూరుపాళ్ళ పరిశుద్ధాత్మ ప్రేరేపణ చొప్పున వ్రాయ బడెనని పేతురు ఇక్కడ చెప్పుచున్నాడు. అపొ.పౌలు కూడ క్రొత్తనిబంధన విషయమై అట్లే చెప్పుచున్నాడు: "ఆ హేతువు చేతను, మీరు దేవుని గూర్చిన వర్తమాన వాక్యము మా వలన అంగీకరించినప్పుడు, మనుష్యుల వాక్యమని యెంచక, అది నిజముగా ఉన్నట్టు దేవుని వాక్యమని అంగీకరించిరి, గనుక మేమును మానక దేవునికి కృతజ్ఞ తాస్తుతులు చెల్లించుచున్నాము. ఆ వాక్యమే విశ్వాసులైన మీలో కార్యసిద్ధి కలుగజేయుచున్నది" (1 థెస్స 2:13). "దైవ జనుడు సన్నద్ధుడై ప్రతి సత్కా ర్యమునకు పూర్ణముగ సిద్ధపడి యుండునట్లు దైవావేశమువలన కలిగిన ప్రతి లేఖనము ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పు దిద్దుటకును, నీతియందు శిక్ష చేయుటకును ప్రయోజ నకరమైన యున్నది" యని అపొ.పౌలు మరల వ్రాసెను (2 తిమో 3:16,17).

బైబిలు గ్రంధమంతయు యధార్ధ మని, అది దేవుని వాక్యమని క్రొత్త నిబంధన మరింత దృఢముగ నిరూ పించుచున్నది. దేవుడే దానియొక్క గ్రంధకర్తయని బైబిలు తనకుగా తాను చెప్పుకొనుచున్నది. బైబిలును వ్రాయుటకు 1600 సం॥ల కాలములో 40 మంది వ్యక్తులను దేవుడు వినియోగించినను, వారిలో ఏ ఒక్కడును కూడ అతడు వ్రాసిన లేఖనములకు గ్రంధకర్తనని ఆరోపించు కొనలేదు. మానవ నైజమును బట్టి ఇది ఆశ్చర్యము కాదా? బైబిలునందున్న 66

పుస్తకములను వ్రాయుటకు దేవుడు వివిధరకములైన మనుష్యులను అనగా రాజులను, సైనికులను, గొల్లలను, వ్యవసాయకులను, జాలరులను వినియోగించెను.

అరేబియాలోని యెడారిలో మోషేతో అది ఆరంభమై పత్మాసు అను ద్వీపము మీద భక్తుడైన యోహానుచే అది ముగించబడెను. అందులో కొంత రాజుల భవనములలో లిఖించబడెను, మరికొంత గొల్లల గుడారములలో వ్రాయబడెను. కొంత నీటి ఓరను వ్రాయబడెను. మరికొంత చెరసాలలో నుండి వ్రాయబడెను. బైబిలులో కొంత భాగము మహా విద్యావంతులచే వ్రాయబడెను. మరికొంత అయితే బహు పామరులయిన జాలరులచే వ్రాయబడెను. అది వేర్వేరు దేశములలో వేర్వేరు భాషలలో వ్రాయబడెను. అయినను బైబిలునందలి పుస్తకముల నన్నిటిని మనము సమకూర్చి చూచిన యెడల అవన్నియు ఒకేఒక్క గ్రంథముగా మిళితమై యుండుటయే గాక అందులో గొప్ప ఐక్యత మనకు కన్పడుచున్నది. అందులో స్వవిరుద్ధ సంగతులేమియునులేవు; భిన్నాభిప్రాయములు అంతకుముందే లేవు. కాలము మారుచున్న కొలది అనేక గ్రంథములు సవరించబడుచూ యుంటాయి. గాని బైబిలు అయితే సవరించబడనవసరము లేని గ్రంథమై యున్నది. అది దోషరహితమై ప్రతి కాలమునకు అనుగుణముగా యున్నది.

అట్టి గ్రంథమును దేవుడు మాత్రమే వ్రాయగలిగిన వాడు. సొలొమోను నిర్మించిన దేవాలయపు పరికరములన్నియు ఒక గొప్ప వ్యక్తిచే తయారు చేయించబడినందున, అవన్నియు ఒక దానిలో మరియొకటి ఎంత పరిపూర్ణముగా యిమడ్చబడెనో, అట్లే బైబిలులోని పుస్తకములన్నిటిని వ్రాసినవాడు ఒక్కడే, దేవుడే గనుక, అవి ఒకదానితో మరొకటి గొప్ప సమైక్యతను కలిగి యున్నవి. 40 మంది వ్యక్తులు, ఒకరినొకరు ఎరుగకుండ, వేర్వేరు దేశములలో జీవించుచు, వేర్వేరు భాషలలో వ్రాయుచూ వారిని ప్రేరేపించుచున్న ఆత్మ ఒక్కడే కాని యెడల అట్టి పరిపూర్ణ గ్రంథమును తయారు చేయుట సాధ్యమా ?

2-3 వందల పేజీలు గల పుస్తకమును ఒకే అంశముపై ఏ మానవుడయినా వ్రాయ పూనుకొను సరికి అందు స్వవిరుద్ధ సంగతులుండక మానవు.

బైబిలు అయితే విడివిడిగా వివిధ మనుష్యులచే లిఖించబడెను. ఈ వివిధ భాగములన్నిటిని ఒకచోట సమకూర్చగా అవన్నియును ఏకమై చక్కటి పరిపూర్ణ గ్రంధమాయెను. మానవుని భౌతిక, నైతిక, ఆధ్యాత్మిక అవుసరములను తీర్చగల శక్తి ఆ గ్రంధమందున్నది. అజ్ఞానాంధకార ములో మునిగియున్న మానవునికి అది వెలుగుబాటయై యున్నది: అందువల్లనే "నీ వాక్యము నా పాదములకు దీపమును, నాత్రోవకు వెలుగునై యున్నది". నీ వాక్యములు వెల్లడి అగుటతోడనే వెలుగు కలుగును, అవి తెలివిలేనివారికి తెలివి కలిగించును" అని దావీదు మహారాజు పలికెను (దా.కీర్త 119:105,130). పాపకూపములో యుండి మునిగిపోయి నశించుచున్న మానవునికి ఒకే ఒక్క నిజరక్షకుని బైబిలు సూచించుచున్నది. అందువల్లనే యేసుక్రీస్తు ఈ లోకము నకు దేవుడై యుండియు నరునివలె వచ్చెను. దేవుని ప్రేమను పాపులకు ప్రకటించెను. చివరకు వారి నిమిత్తమై సిలువపై తన పరిశుద్ధ రక్తమును కార్చెను.

నిర్దేవులును, నాస్తికులును, అస్తికులును, బైబిలును శంకింప వచ్చును. వారి అపనమ్మకము వలన దేవుడు దేవుడు కాకపోడు, బైబిలు గ్రంధము దేవుని వాక్యము కాకపోదు. నిన్ను అయితే యేసు ఈనాడు ఇట్లు పిలుచుచున్నారు.:- "ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్త జనులారా, నాయొద్దకు రండి; నేను మీకు విశ్రాంతి కలుగజేతును. నేను సాత్వికుడను, దీనమనస్సు గలవాడను. గనుక మీమీద నా కాడి ఎత్తుకొని నా యొద్ద నేర్చుకొనుడి. అప్పుడు మీప్రాణములకు విశ్రాంతి దొరుకును" (మత్త 11:28, 29). యేసు ప్రభువునందు విశ్వసించి, నీ పాపముల విషయమై మారుమనస్సునొంది, క్రీస్తు నామమును మనుష్యుల యెదుట ఒప్పుకొని, పాపక్షమాపణ నిమిత్తము నీవు బాప్తిస్మము పొందిన యెడల, నీ ఆత్మీయతృష్ణను ఆయన తీర్చుటయే గాక, నీ ప్రాణమునకు విశ్రాంతిని ఆయన తప్పక నీకు దయచేయును.

**- జాషువా గూటం**

# సంఘ రూపురేఖలు
## (Indentity of the Church)

అనేక సంవత్సరముల నుండి తప్పిపోయిన మిత్రుని నీవు ఎట్లు కనుగొనగలవు? ముందుగా నీవు అతని రూపురేఖలను గూర్చిన సమాచారము నంతయు సేకరించి అప్పుడు అతని వెదక మొదలిడుదువు గదా? నీవు వెదుకుచున్న మిత్రుని పోలికలన్నిటిని కలిగినవానిని చివరకు నీవు అంగీకరించుదువు. అట్లే ఈ లోకములో అనేక సంఘములున్నవి. అయితే వీటన్నిటిలోను సరియైనది, నిజమైనది ఏదో మనకు ఎట్లు తెలియును? దీనిని తెలిసికొనుటకు మనము నిజ సంఘము యొక్క రూపురేఖలను తెలిసికొని ఈ లోకములో యున్న సంఘముల నన్నిటిని ఆ నిజ సంఘముతో పోల్చిచూడవలెను. అన్ని విషయము లలోను నిజ సంఘము యొక్క పోలికలు గలదానినే నిజసంఘమని మనము అంగీకరించక తప్పదు. అయితే నిజసంఘము యొక్క లక్షణములు ఏమి? అవి మనకు ఎక్కడ దొరుకును? బైబిలు గ్రంథమే దీనికి జవాబు.

సంఘము యొక్క నిజలక్షణము లనన్నిటిని బైబిలు బోధించుచున్నది. గనుక అవి ఏమిటో ఇప్పుడు చూచెదము:

1. క్రీస్తు సంఘమును స్థాపించెను. "మరియు నీవు పేతురువు. ఈ బండ మీద నా సంఘమును కట్టుదును, పాతాళలోక ద్వారములు దానియెదుట నిలువనేరవు" అని యేసు చెప్పెను. (మత్తయి 16:18).

2. అది యెరూషలేము నందు ఆరంభించబడెను. లూకా 24:45-49 మరియు అపొ.కా. 2:5 లో ఇది మనకు కనబడుచున్నది.

3. అది క్రీ॥శ॥ 33వ సంవత్స రములో ఆరంభించబడెను. పెంతెకోస్తు దినమున ఇది జరిగెను. ఇది అపొ.కా. 2వ అధ్యాయమునందు మనకు కన్పించుచున్నది.

4. సంఘము క్రీస్తు నామమును ధరించును. అనేక స్థానిక సంఘము లను గూర్చి చెబుతూ "క్రీస్తు సంఘము లన్నియు మీకు వందనములు చెప్పుచున్నవి" యని పౌలు పలికెను (రోమా 16:16). కొరింథులో నున్న

సంఘమును ఉద్దేశించి, మీరు క్రీస్తు యొక్క శరీరమై యుండి, వేరువేరుగా అవయువములై యున్నారు" అని అతడు పలికెను (1కొరింథి 12:27). అయితే ఈ శరీరమేమైయున్నది? సంఘమై యున్నది (ఎఫెసీ 1:22,23).

5.దాని సభ్యులు క్రైస్తవులనబడిరి. "మొట్టమొదట అంతియొకయలో శిష్యులు క్రైస్తవులనబడిరి" (అపొ.కా. 11:26). "అందుకు అగ్రిప్ప–ఇంత సులభముగానన్ను క్రైస్తవుని చేయ జూచుచున్నావే అని పౌలుతో చెప్పెను" (అపొ.కా. 26:28). "ఎవడైనను క్రైస్తవుడైనందుకు బాధ అనుభవించిన యెడల అతడు సిగ్గుపడక ఆ పేరును బట్టియే దేవుని మహిమ పరచవలెను" (1పేతురు 4:16). "మరి ఎవని వలనను రక్షణ కలుగదు; ఈ నామముననే మనము రక్షణ పొందవలెను గాని, ఆకాశము క్రింద మనుష్యులలో ఇయ్యబడిన మరి ఏ నామమున రక్షణ పొందలేము" (అపొ.కా. 4:12).

6.క్రీస్తు దానికి శిరస్సు అయి యున్నాడు. సంఘము అను శరీరము నకు ఆయనే శిరస్సు. ఆయనకు అన్నిటిలోను ప్రాముఖ్యము కలుగు నిమిత్తము ఆయన ఆదియై యుండి మృతులలో నుండి లేచుటలో ఆది సంభూతుడాయెను (కొలస్స 1:18).

7.ఒకేఒక్కటి ఉన్నది. "శరీర మొక్కటే, ఆత్మయు ఒక్కడే, ఆ ప్రకారమే మీ పిలుపు విషయమై యొక్కటే నిరీక్షణ యందుండుటకు పిలువబడితిరి" (ఎఫెసీ 4:4). అయితే ఈ శరీర మేమిటి? అది సంఘము (కొలస్స 1:18). గనుక ఒకే శరీర మున్నట్లయితే ఆ శరీరము సంఘమయితే సంఘము ఒక్కటే యున్నది.

8. సంఘములో చేరుటకు కొన్ని షరతులున్నవి. అవి విశ్వాసము (హెబ్రీ 11:6). మారుమనస్సు (అపొ.కా. 17:30), ఒప్పుకోలు (రోమా 10: 9,10), బాప్తిస్మము అనునవి (మార్కు 16:16). ఒకడు రక్షించబడిన తరువాత సంఘములో చేర్చబడును. (అపొ.కా. 2:47). మరియు రోమా 6:3,4; గలతి 3:26,27;1 కొరింథి 12:13లో చూచిన మనము క్రీస్తులోనికి, ఆయన సంఘములోనికి బాప్తిస్మము పొందినట్లు గ్రహించగలము. ఈ ఆజ్ఞలకు విధేయత చూపుట ద్వారా ఒకడు ఆయన రాజ్యములో లేక సంఘములో జన్మించిన వాడనబడును (యోహాను

3:3,5).

9. సంఘము యొక్క ఆరాధన ప్రత్యేకమైనది. క్రైస్తవులు ఆదివారమున కూడుకొందురు (అపొ.కా. 20:7), పాటలు పాడుదురు (ఎఫెసీ 5:19), ప్రార్థన చేయుదురు (అపొ.కా. 2:42), వాక్యమును చదువుదురు (2తిమో 2:15), ప్రభువు రాత్రి భోజనమును చేయుదురు (1 కొరింథి 11), మరియు చందానిచ్చెదరు (1 కొరింథి 16:2).

10. సంఘబోధ అంతయు బైబిలుపై ఆధారపడి యున్నది. దానికి కొంత కలుపుటగాని, తీసివేయుటగాని, లేదా మరింకొక దానిని చేయుటగాని జరుగదు (ప్రకటన 22:18, 19; గలతి 1:6-11). బైబిలు ఒక్కటి మాత్రమే సంఘ విశ్వాస ప్రమాణ పుస్తకమై యున్నది. మిగిలిన వాటినన్నిటిని అది తిరస్కరించును.

11. సంఘము యొక్క పరిపాలన అంతయు దేవుని వాక్యమును బట్టి జరుగవలెను. క్రీస్తే శిరస్సు ప్రతి స్థానిక సంఘము దాని పెద్దలను, పరిచారకులను కలిగియుండవలెను (1 తిమోతి 3; తీతు 1). ప్రభువు సంఘమునకు భూలోకములో ఏ మానవుడు శిరస్సుగా లేడు. దానికి ఒక ముఖ్యకేంద్రము లేదు. సరిగదా దానికి జాతీయముగా గాని, అంతర్జాతీయముగాగాని ఒక మానవ కల్పిత ఆర్గనైజేషన్ లేదు.

12. సంఘము యొక్క పని మూడు విధములు. అది సువార్తను ప్రకటించును (మార్కు 16:15,16). ఆపదలో నున్నవారికి సహాయము చేయును (గలతి 6;యాకోబు 2). మరియు సభ్యులను వాక్యము నందు హెచ్చరించును (హెబ్రీ 3:12-14).

13. ప్రతి క్రైస్తవుడు నమ్మకమైన క్రైస్తవ జీవితమును జీవించవలెను. మనము లోకమును ప్రేమించరాదు (1యోహాను 2:15; యాకోబు 4:4). గాని ఆత్మఫలములను ప్రేమించవలెను (గలతి 5:22,23). నమ్మకమైన జీవితమును జీవించినవారికే నిత్యజీవ కిరీట మీయబడును (ప్రకటన 22:10).

పైన చెప్పబడినవి సంఘము యొక్క కొన్ని రూపురేఖలు లేదా లక్షణములు. ఇవన్నియును బైబిలు నుండి తీయబడినవి. నీ సంఘమును వీటితో పోల్చి చూడుము. ఉదాహరణకు మొదటి నాలుగు అంశములను చూడుము. నీ సంఘమును ఎవరు స్థాపించిరి? క్రీస్తా లేక ఒక మానవుడా? నీ సంఘము

ఎక్కడ స్థాపించబడినది? యెరూషలేము నందా లేక మరొక చోటనా? నీ సంఘము ఎప్పుడు స్థాపించబడినది? అది క్రీ॥శ॥33వ సంవత్సరము తరువాతనైతే అది ప్రభువు సంఘము కానేరదు. నీ సంఘము ఏ నామమును ధరించుకొన్నది? అది క్రీస్తు నామమును ధరించకపోయినట్లయితే ప్రభువు సంఘమెట్లగును? ఈలాగున నీవు పరిశోధించిన యెడల నీ సంఘము ప్రభువునిదో లేక మరొక మానవునిదో ఇట్టే గమనించగలవు. మిగిలిన సంఘములు నన్నిటిని నీవు ఇట్లేపోల్చి చూడుము. మంచి మనస్సాక్షి గలవాడవైతే వాటి భేదములను నీవు సులభముగ గ్రహించగలవు.

నీ సంఘము బైబిలు నందున్నట్టి నిజసంఘము కాదని నీవు గ్రహించి నట్లయితే దానిని వెనుక వదలిపెట్టి, సత్యమును తెలిసికొని, దానికి లోబడి క్రీస్తు సంఘసభ్యుడవు అగుటకు త్వరపడవలెనని కోరుచున్నాము. అప్పుడు రక్షణ దేనిలో యున్నదో దానిలో నీవు ఉండగలవు.

– జె.సి. ఛోట్

ప్రకటన గ్రంథ ప్రసంగమాలిక – 1

మొదటి అధ్యాయము

## క్రీస్తు యొక్క చిత్రములు
## (Pictures of Christ)

**పరిచయం :** ప్రకటన మొదటి అధ్యాయమును తప్పక చదవాలి.

1.ప్రకటన గ్రంథం క్రీస్తును గూర్చిన గ్రంథం.

2.యేసుక్రీస్తు తన దాసులకు కనుపరచుటకు దేవుడాయనకు అనుగ్రహించిన ప్రత్యక్షత అది.

3.క్రీస్తు పరిపూర్ణముగా ఈ గ్రంథములో బయలు పరచబడెను.

4.సువార్తలలో యేసును పరిచర్య చేస్తు శ్రమలననుభవిస్తూ చూస్తాము. అపో.కార్యములలోను పత్రికలలోను ఆయన సజీవుడై సంఘములలో పనిచేయుట చూస్తాం.

ప్రకటన గ్రంథంలో ఆయన సర్వ సైన్యాధిపతి వలె మనకగుపడును.

**ఉపోద్ఘాతం :**

A. మొదటి వచనంలో దేవుని బయల్పాటు యొక్క క్రమం కనబడ్తాది. దేవుడు తన చిత్తాన్ని క్రీస్తుకు బయలు పర్చారు. క్రీస్తుదాన్ని ఒక దూతకు బయలు పర్చారు. ఆ దూత దానిని మనుష్యునికి బయలు పర్చాడు.

"ప్రవక్తల ఆత్మలకు దేవుడగు ప్రభువు త్వరలో సంభవింపవలసిన వాటిని తన దాసులకు చూపుటకై తన దూతను పంపెను" (ప్రక 22:6). బయల్పాటు క్రమాన్ని ఈ విశ్వం యొక్క క్రమాన్ని ఇందులో గమనించవచ్చును.

"ప్రతి పురుషునికి శిరస్సు క్రీస్తనియు, స్త్రీకి శిరస్సు పురుషు డనియు, క్రీస్తునకు శిరస్సు దేవుడనియు మీరు తెలిసికొనగోరు చున్నాను" (1కొరింథీ 11:3).

B. "ఈ సంగతులు త్వరలో సంభవింపనై యున్నవి".

"సమయము సమీపించినది" అను ఈ మాటలను బట్టి ఇందలి వర్త మానము యోహాను కాలము నాటికి వర్తించునని భావం. అయినను ఆ సమయం దేవుని కాల నిర్ణయాన్ని బట్టియేయని గుర్తించాలి. 2 పేతురు 3:8 లో దేవునికి వెయ్యి సంవత్స రములు ఒక దినము వలె యున్నవని చెప్పబడింది.

C. 3వ వచనంలో ప్రకటన గ్రంథములో కనబడుధన్యతలలో ఒకటి ఉన్నది. ప్రకటన గ్రంథము ఒక్కదానిలో మాత్రమే దానిని చదువువాడును. అందులో వ్రాయబడిన సంగతు లను గైకొనువాడును ధన్యుడని చెప్ప బడింది.

మనం వింటూయుండాలి, చదువు చూయుండాలి. అప్పుడే ధన్యత

**II. ఏడు సంఘములకు వర్త మానము: (1:4-11).**

A. నాలుగు, ఐదు వచనాలో ముగ్గురు నుండి ఈ గ్రంథం వచ్చినట్లు చెప్ప బడింది.

వర్తమాన, భూత భవిష్యత్కాల ములలో ఉన్న వాని నుండియు (తండ్రి నుండియు) సింహాసనము ఎదుట నున్న ఏడు ఆత్మల నుండియు (పరిశుద్ధాత్మ

నుండియు) యేసుక్రీస్తు నుండియు (కుమారుని నుండియు) త్రియేక దేవుని ఇక్కడ మనం చూడ గలము.

B. క్రీస్తు నమ్మకమైన సాక్షియని పిలువబడెను (5వ).

ఆయన నమ్మదగినవాడు, అబద్ధమాడ జాలడు. (హెబ్రీ 6:18,తీతు 1:2)

C. ఆయన మృతులలో నుండి ఆది సంభూతుడని పిలువబడెను. ఇది వరలో చనిపోయి, లేపబడిన వారున్నను, వారు మరల చనిపోయారు. క్రీస్తు ఎన్నటికీ చనిపోకుండు నిమిత్తం చనిపోయి తిరిగి లేచారు. ఈ గ్రంధము లో బయలు పరచబడుచున్న వ్యక్తి ఎంత గొప్పవాడో! ఆయన ఒకే ఒక్కడు!

D. క్రీస్తు భూపతులకు అధిపతి! ఆయన ఇప్పుడు పాలించు చున్నారు. ఆయన మరల వచ్చి ఈ భూమిపై "వెయ్యేండ్లు" పాలించ బోవుట లేదు. ఆయన ఇప్పుడు రాజై యున్నారు! నిజానికి ఆయన "ప్రభువులకు ప్రభువును రాజులకు రాజునై యున్నారు" (ప్రక 17:14). "ఆ సర్వాధిపతి రాజులకు రాజును ప్రభువులకు ప్రభువునై యున్నారు"(1 తిమో 6:15). "ఈ లోక రాజ్యము మన ప్రభువు రాజ్యమును ఆయన క్రీస్తు రాజ్యము నాయెను" (ప్రక 11:15).

E. ఆయన మనలను ప్రేమించుచు యున్నారని 6వ వచనం చెప్పుచున్నది. దేవుడు ప్రేమయై యున్నాడు (1 యోహాను 4:8).

ఆయన తనవారిని అంతము వరకు ప్రేమించెను (యోహాను 13:1). ఆయన క్రైస్తవులను వారి జీవితాంతము వరకు, ఈ లోకాంతము వరకు ప్రేమించును.

F. క్రీస్తు తన రక్తము వలన మన పాపము నుండి మనలను విడిపించెను. అనునది గతాన్ని సూచించుచున్నది. మనం బాప్తిస్మము పొందినప్పుడావని జరిగెను.

మనం వెలుగులో నడిచే కొలదీ ఆయన మనలను పాపము నుండి విడుదల చేస్తుంటారు (1 యోహాను 1:7).

1.పాపము మహా సముద్రములో

మునగదు. అగ్నిలో కాలిపోదు, పర్వతాలు దాన్ని దాచలేవు, కన్నీళ్లు కరిగించలేవు. గాని క్రీస్తు రక్తమే శుద్ధిచేయును.

2. రక్తము చిందింపబడ కుండ పాపక్షమాపణ కలుగనేరదు" (హెబ్రీ 9:22) క్రీస్తు రక్తము లేకుండా పాప బానిసత్వము నుండి విడుదల లేదు. క్రీస్తు తన రక్తాన్ని పాపక్షమాపణ కొరకు చిందించెను. (మత్త 26:28).

ఆరక్తము మనలను విమోచించెను (అపొ.కా. 20:28). మన పాప వస్త్రములను తెల్లగా చేయునది అదే (ప్రక 7:14). బాప్తిస్మము పొందినప్పుడు పాపము కడిగివేయబడతాది. (అపొ.కా. 22:16).

G. క్రీస్తు మనలను దేవునికి ఒక రాజ్యముగాను, యాజకులను గాను చేసెను అని 6వవచనం చెప్పుచున్నది. మనం ఇప్పుడు దేవుని రాజ్యమై యున్నాము. అది ఎప్పుడో స్థాపించబడబోయే "వెయ్యేండ్ల రాజ్యము" కాదు, అది బైబిలులో లేదు. సంఘము, రాజ్యము ఒక్కటే (కొలస్స 1:13; మత్త 16:18-19). మొదట దేవుని రాజ్యమును (సంఘమును) ఆయన నీతిని వెదకుడి" యని క్రీస్తు బోధించెను (మత్త 6:33).

H. క్రీస్తు మనలను యాజకులనుగా కూడ చేసెను. మనం ఆయన ఆలయమైన సంఘములో ఆత్మీయ బలులు అర్పించుటకు రాజులైన యాజకులం (1పేతురు 2:5,9 ; 1 కొరింథీ 3:16).

I. దేవుడు ఇశ్రాయేలీయులను యాజక రూపమైన రాజ్యముగా చేసారు (నిర్గమ 19:6).

J. 7వ వచనంలో క్రీస్తు రెండవ రాకడ వర్ణించబడెను.

1. ఆయన మేఘారుఢుడై ఆరోహణమాయెను. అదేరీతిగా తిరిగి వచ్చును (అపొ.కా. 1:11).

2. ప్రతినేత్రము ఆయనను చూచును. జెకార్య 12:10 లో కూడయిది చెప్పబడింది.

K. నేనే (I Am) అను మాటలతో 8వ వచనం ఆరంభమవుచున్నది. ఈ అధ్యాయములో 'నేనే' అను పదములు 5 మార్లున్నవి.

1. క్రీస్తు అల్ఫాయు, ఓమెగయు అయ్యున్నారు. యివి గ్రీకు భాషలో మొదటి ఆఖరి అక్షరములు.

క్రీస్తే ఆది అంతమునని యివి సూచించును. ఆయన నిత్యుడు. యెషయా 9:6లో ఆయన నిత్యుడగు తండ్రియని చెప్పబడింది. ఆయన నిత్యత్వానికి నాంది. నిత్యం రక్షించు వాడు ఆయనే.

2. క్రీస్తు సర్వాధికారి యని కూడ చెప్పబడింది. ఆయన సర్వశక్తి మంతుడు. మరల యెషయా 9:6 లో ఆయన బలవంతుడైన దేవుడని చెప్ప బడింది.

3. యివి దేవుని లక్షణాలు క్రీస్తు దేవుడై యున్నారు. శరీరము ధరించిన వాక్యం ఆయన.

L 9-11 వచనాల్లో యోహాను ఒక దర్శనం చూస్తాడు.

మీ సహోదరుడను అని అతడు చెప్పుచున్నాడు. ప్రభువు నందు అతడు వారి సహోదరుడు, అతడు, ఏడు సంఘములు ఈ సంబంధాన్ని కలిగి యున్నారు.

అతడు శ్రమలలోను, రాజ్యము లోను, సహనములోను వారితో పాలివాడు. అతడు పత్మాను ద్వీపమున పరవాసియై యున్నాడు. అతడు దేవుని వాక్యము నిమిత్తమును, యేసును గూర్చిన సాక్ష్యము నిమిత్తమును అక్కడ బందీగా యున్నాడు.

ప్రభువు దిన మందు అతడు ఆత్మ వశుడైయుండెను. అది ఆదివారం, పరి శుద్ధాత్మ దేవుని వలన దర్శనం అతడు చూడ గలిగాడు. ప్రభువు ఆదివారమున పునరుత్థాను డయ్యారు గనుక అది ప్రభువు దినం. క్రీస్తు సంఘము కూడ ప్రభువు దినమందే ఆరంభ మాయెను. ఆ దినమందు క్రైస్తవులు ప్రభురాత్రి భోజనాన్ని ఆచరిస్తారు కానుకలిస్తారు (అపొ.కా. 20:7; I కొరింథీ 16:1-2).

**III. క్రీస్తు యొక్క వ్యక్తిత్వము:**

A. 13వ వచనంలో క్రీస్తు దీపస్తంభముల మధ్య సంచరించు చున్నారు. ఆ దీపస్తంభములు సంఘములు (ప్రక 1:20;2:1). ఎక్కడ ఇద్దరు ముగ్గురు కూడి యుంటారో వారి మధ్య యుందు నని క్రీస్తు వాగ్దానం చేసారు (మత్త

18:20).

ఆయన మనుష్య కుమారుడని చెప్పబడింది. క్రీస్తు యొక్క మానవత్వాన్ని వర్ణించుటకు ఈలాగు ఆయన తన్ను గూర్చి చెప్పుకొనేవారు. ఆయన వస్త్రములు, బంగారు దట్టి, యాజకుడు, రాజు ధరించునట్టివి.

"ఆయన సింహాసనాసీనుడై యాజకత్వము చేయునని" జెకర్యా ప్రవచించాడు (జెకర్యా 6:13).

నిజానికి క్రీస్తు "రాజులకు రాజు", "ప్రధాన యాజకుడు" (ప్రక 7:14; హెబ్రీ 4:15).

B. ఆయన తలయు వెంట్రుకలును హిమమంత తెల్లని ఉన్నిని పోలినవి (14వ). యెషయా 1:18లో ఆయన ఇట్లు చెప్పారు. "రండి మన వివాదము తీర్చుకొందము. మీ పాపములు రక్తము వలె ఎర్రని వైనను అవి హిమము వలె తెల్లబడును".

"హిమమంత తెలుపు" పవిత్రతను సూచించుచున్నది. దానియేలు 7:9లో మహావృద్ధుని వస్త్రము హిమము వలె ధవళము గాను తలవెంట్రుకలు శుద్ధమైన గొర్రెబొచ్చువలె తెల్లగా ఉండెను. క్రీస్తు పవిత్రుడే గాక, వయస్సు లేనివాడు, మరణం లేనివాడు, నిత్యుడు.

C. క్రీస్తు నేత్రములు అగ్నిజ్వాలల వలె నుండెను.

ప్రక 19:12 కూడ చూడుము. ఆయన సర్వజ్ఞాని.

ఆయన నేత్రములు మనుష్యుని అంతరంగమును పరిశోధించును. (హెబ్రీ 4:13).

ఆయన నేత్రములు తరుచు కన్నీటి వలన ఎర్రనివాయెను.

D. 15వ వచనంలో ఆయన పాదములు వర్ణించబడెను.

ఆయన ఇశ్రాయేలులో మట్టి మార్గములలో నడిచారు, సువార్త ప్రకటించారు. గనుక ఆయన పాదములు సుందరములు (రోమా 10:15). మరియ యొక్క కన్నీటితో తుడవబడిన పాదములు ఆయనవి. సిలువకు మేకులతో దిగగొట్టబడిన పాదములు అవి.

ఇప్పుడవి కొలిమిలో పుటము వేయబడిన అపరంజితో సమాన

ములు. యిది సహనము నకు, శక్తికి సూచన, క్రీస్తు నిజానికి సర్వ శక్తిమంతుడు !

E. "ఆయన కంఠస్వరము విస్తారమైన జలప్రవాహము వలె యుండెను" (15వ). యేసు యొక్క స్వరము ! దాన్ని ఆలోచించు.

పసిబాలునిగా ఆయన స్వరాన్ని (ఏడ్పును) తల్లి మరియ వినెను. ఆయన స్వరం తండ్రియొక్క చిత్తాన్ని మనకు బయలు పరచెను. సిలువ మీాద నుండి ఏడుమారులు పలుకగా, ఆయన స్వరాన్ని మానవ జాతి ఆఖరిగా ఈ లోకంలో విన్నాది.

1. ఆయన స్వరం గొప్ప బూరధ్వని వలె యుండెను. (10వ)

2. తనతో మాటలాడుచున్న స్వరాన్ని యోహాను చూడ తిరిగాడు (12వ)

3. ఆయన స్వరము విస్తార జలప్రవాహము వలె యుండెను. (15వ) 4. ప్రకటన గ్రంథములో జలములు ప్రజలకు, జనాంగము లకు, జనసమూ హముకు గురుతు (ప్రక 17:15). గనుక ఆయన స్వరము జనసమూహాముల స్వరము.

F. ఆయన నోటినుండి రెండంచులు గల వాడియైన ఖడ్గము బయలు వెళ్లు చుండెను (16వ). ప్రక 2:12,16; 19:16 లో కూడ ఈ వర్ణన కలదు.

1.ఆ ఖడ్గము ఆత్మ ఖడ్గమే, అది దేవుని వాక్యము (ఎఫెసీ 6:17).

2.అది రెండంచులు గలది గనుక హృదయము యొక్క తలంపు లను ఆలోచనలు బయలు పర్చును (హెబ్రీ 4:12).

3. అది రెండంచులు గలది గనుక అది సంహరించును, సంరక్షించును (I కొరింథీ 1:18).

G. ఆయన ముఖము మహా తేజస్సు గల సూర్యుని వలె ఉండెను (17వ). ఆయన రూపాంతర సందర్భమును ఇది గుర్తు చేయుచున్నది. "అక్కడ ఆయన ముఖము సూర్యుని వలె ప్రకాశించెను, ఆయన వస్త్రములు వెలుగు వలె తెల్లనివాయెను. (మత్తయి 17:2). క్రీస్తు ఈ లోకమునకు వెలుగు (యోహాను 8:12). ఆయన "ప్రకాశ మానమైన

వేకువ చుక్క" (ప్రక 22:16). యిది ఆయన మహిమను వర్ణించుచున్నది.

H. 17,18 వచనాల్లో క్రీస్తు యొక్క అధికారమును మనం చూడ గలము. "నేనాయనను చూడగానే" అని యోహాను అన్నాడు.

యోహాను యేసును భూమి మీద చూచాడు. ఆయన రోగులన్ను బాగుచేయడం, మృతులను లేవడం, జన సమూహములకు ఆహారం పెట్టడం యోహాను చూచాడు.

గాని ఈలాగ ఆయనను మున్నెన్నడు చూడలేదు.

ఆయనను చూడగానే చచ్చినవావలె ఆయన పాదముల యొద్దపడ్డాడు.

యోహానును ధైర్యపరచుటకు క్రీస్తు తన కుడిచేతిని అతనిమీద ఉంచెను (18వ).

కుడిచేయి శక్తికి అధికారానికి సూచన (హెబ్రీ 1:3;ఎఫెసీ 1:20).

**ముగింపు:**

క్రీస్తు మనలను ప్రేమిస్తునే యున్నారు. ఆయన తన రక్తము వలన మన పాపములను కడుగగోరుచున్నారు. మనలను ఆయన తనకు రాజ్యము గాను, యాజకులు గాను చేసికొని యున్నారు. ఒకానొక దిన మందు రాజులకు రాజును, ప్రధాన యాజకుడును. పరిశుద్ధుడును. మృత్యుంజయుడును, సర్వజ్ఞాని, సర్వశక్తిమంతుడు మహిమాన్వితుడైన క్రీస్తు యేసు మరల రాబోవు చున్నారు. నశించినవారికది గొప్ప విపత్తు దినము గాని రక్షింపబడిన వారికి మహా ఆనంద దినము !

– జాన్ స్టీవ్

**సత్యవాక్కు కావలసిన వారు సంవత్సరమునకు**

**50/-రూ॥లు చందా విధిగా పంపించవలయును.**

SATYA VANI, P.O.BOX-80,KAKINADA-533 001.

# నేడు అద్భుత స్వస్థతలు జరుగుచున్నవా ?

ప్రస్తుత ప్రపంచములో మనం గమనించినట్లుతే "స్వస్థతలు" అనే పేరుతో చాలా మంది చలామణి అయిపోతున్నారు. అసలు "స్వస్థత" అనగా అర్థము ఏమిటి? స్వస్థత అనగా రోగము నుండి బాగుపడుట (లేదా) నయం అగుట.

**I. క్రీస్తు స్వస్థత పరచిన విధానము** :- ప్రభువైన యేసుక్రీస్తు యొద్దకు వచ్చిన ప్రతి ఒక్కరు బాగుపడిరి. "గ్రామముల లోను పట్టణముల లోను పల్లెటూళ్లలోను ఆయన ఎక్కడ ప్రవేశించెనో అక్కడి జనులు రోగులను సంతవీధులలో ఉంచి, వారిని ఆయన వస్త్రపు చెంగు మాత్రము ముట్టనిమ్మని ఆయనను వేడుకొనుచుండిరి. ఆయనను ముట్టిన వారందరు స్వస్థతనొందిరి ! (మార్కు సువార్త 6:56). మరియు ఒక కుష్ఠరోగి ఆయన యొద్దకు వచ్చి ఆయన యెదట మోకాళ్లూని- నీకిష్టమైతే నన్ను శుద్ధునిగా చేయగలవని ఆయనతో చెప్పి, ఆయనను వేడుకొనగా, ఆయన కనికరపడి, చెయ్యిచాపి వానిని ముట్టి - నాకిష్టమే; నీవు శుద్ధుడవు కమ్మని వానితో చెప్పెను ! వెంటనే కుష్ఠరోగము వానిని విడిచెను గనుక వాడు శుద్ధుడాయెను(మార్కు 1:40-42).

పై లేఖనములను బట్టి మనం పరీక్షించినట్లయితే క్రీస్తు యొద్దకు వచ్చిన ప్రతి రోగము చేత పీడింపబడు చున్నావారు "అందరూ బాగుపడిరి", "వెంటనే బాగుపడిరి" "సంపూర్ణముగా బాగుపడిరి" అనే పదములను మనం చూస్తాం.

ఈనాడు మాదగ్గర స్వస్థత వరాలు ఉన్నాయి అని ప్రజలను కొందరు భ్రమ పెట్టుచున్నారు. అయితే వీరు ప్రజలకు కొంత కాలావ్యవధి ఇవ్వటం (7 వారములని) మనం చూస్తాము.

ప్రభువైన క్రీస్తు తరువాత రమ్మని చెప్పినట్లుగా లేఖనములు చెప్పటలేదు. వేంటనే స్వస్థతపరచినట్లుగా మనం గమనించాము. "మరియు అనేకమైన యితర సూచక్రియలను యేసు తన శిష్యుల యెదుట చేసెను; అవి యీ గ్రంథమందు వ్రాయబడలేదు గాని యేసు దేవుని కుమారుడైన క్రీస్తు అని మీరు నమ్మునట్లును, నమ్మి ఆయన నామ మందు జీవము పొందునట్లున్ను యివి వ్రాయబడెను. (యోహాను 20: 30-31).

ఈ లేఖనము బట్టి మనం

గమనించినట్లు యేసు "దేవుని కుమారుడు" అని ఋజువు పరుచుటకు ఆయన అద్భుతములను చేసెను. ప్రియులారా ! నేడు అబద్ధబోధకులు అద్భుతములు చేయవలసిన పనిఏమైనా ఉందా? ఒక్కసారి ఆలోచించండి !

**2 అపొసొలులు స్వస్థత పరిచిన విధానము :-** ఆనాడు సంఘము ఆరంభము దినములలో "వాక్యము" దృఢపరచుటకు అపొస్తొలులు స్వస్థతలు చేసిరి. "అందుచేత పేతురు వచ్చుచుండగా జనులు రోగులను వీధుల లోనికి తెచ్చి, వారిలో ఎవని మీదనైనను అతని నీడయైనను పడవలెనని మంచముల మీదను పరుపుల మీదను వారిని ఉంచిరి. మరియు యోరుషలేము చుట్టునుండు పట్టణముల జనులు రోగులను అపవిత్రాత్మల చేత పీడింపబడిన వారిని మోసికొని కూడి వచ్చిరి. వారందరు స్వస్థత పొందిరి". (అపొస్తొలుల కార్యములు 5:15-16).

మరియు "పగలు మూడు గంటలకు ప్రార్థన కాలమున పేతురును యోహానును దేవాలయమునకు ఎక్కి వెళ్ళుచుండగా, పుట్టినది మొదలుకొని కుంటి వాడైన యొక మనుష్యుడు మోసికొనిపోబడుచుండెను. వాడు దేవాలయములోనికి వెళ్ళువారిని భిక్షమడుగుటకు కొందరు ప్రతి దినము వానిని శృంగారమను దేవాలయపు ద్వారమునొద్ద ఉంచుచు వచ్చిరి. పేతురును యోహానును దేవాలయము లో ప్రవేశింపబోవునప్పుడు వాడు చూచి భిక్షమడుగగా, పేతురును యోహానును వానిని తేరిచూచి మాతట్టు చూడమనిరి. వాడు వారి యొద్ద ఏమైన దొరుకునని కనిపెట్టుచు వారియందు లక్ష్య ముంచెను,అంతట పేతురు వెండి బంగారములు నాయొద్ద లేవు గాని నాకు కలిగినదే నీకిచ్చుచున్నాను; నజరేయు డైన యేసు క్రీస్తు నామమున నడువుమని చెప్పి, వాని కుడిచెయ్యి పట్టుకొని లేవనెత్తెను; వెంటనే వాని పాదములును చీలమండలును బలము పొందెను. వాడు దిగ్గున లేచి నిలిచి నడిచెను. నడుచుచు గంతులు వేయుచు దేవుని స్తుతించుచు వారితో కూడ దేవాలయము లోనికి వెళ్లెను అని (అ.పొ.కా. 3-1-8).

మరియు ఆయన నామమందలి విశ్వాసము మూలముగా ఆయన నామమే మీరు చూచి యెరిగియున్న వీనిని బలపరచెను. ఆయన వలన కలిగిన విశ్వాసమే మీ అందరి యెదుట వీనికి ఈ పూర్ణ స్వస్థత కలుగజేసెను. అని అ.పొ.కా. 3:16 లో వ్రాయబడి

యున్నది.

ప్రియులారా! పై లేఖనములను బట్టి మనం గమనించినట్లుతే అపొస్తొలుల ద్వారా కూడ "స్వస్థత"వెంటనే పొందిరి, అందరూ బాగుపడిరి, సంపూర్ణముగా బాగువడిరి అని లేఖనములు చెప్పుచున్నవి. మరియు ఎందుకనగా దేవదూతల ద్వారా పలుకబడిన వాక్యము స్థిరపరచబడి నందున ప్రతి అతిక్రమమును అవిధేయుతయు న్యాయ మైన ప్రతి ఫలము పొందియుండగా ఇంతగొప్ప రక్షణను మనము నిర్లక్ష్యము చేసిన యెడల ఏలాగు తప్పించు కొందుము? అట్టి రక్షణ ప్రభువు బోధించుటచేత ఆరంభమై, దేవుడు తన చిత్తాను సారముగా సూచక క్రియల చేతను, మహాత్కార్యములును, నానావిధములైన అద్భుతముల చేతను, వివిధములైన పరిశుద్ధాత్మ వరములను అను గ్రహించుట చేతను, వారితో కూడ సాక్ష్యమిచ్చుచుండగా వినిన వారి చేత మనకు ధృధపరచబడెను. (హెబ్రి 2:2-4). అపొస్తొలులు కేవలము "వాక్యము" స్థిరపరుచుటకు (లేదా) దృధపరుచుటకు అద్భుత "స్వస్థతలు" చేసినట్లు గా మనం గమనిద్దాము.

**3. పౌలు చేసిన స్వస్థత విధానము:-**

పౌలు అందరికి కడవట అకాలమందు పుట్టినట్టున్నవాకును కనబడెను. ఏలయంగా నేను అపొస్తలులందరిలో తక్కువాడను దేవుని సంఘమును హింసించినందున అపొస్తలుడనబడుటకు యోగ్యుడకాను. అని 1కొరింధి 15:8-9లో చెప్పు చున్నాడు. "మరియు దేవుడు పౌలుచేత విశేషమైన అద్భుతములను చేయించెను; అతని శరీరమునకు తగిలిన చేతి గుడ్డలైనను నడికట్లయినను రోగుల యొద్దకు తెచ్చినప్పుడు రోగములు వారిని విడిచెను, దయ్యములు కూడ వదలిపోయెను (అపొ.కా. 19:11-12). మరియు ఐతుకు అనునొక యౌవనస్థుడు, కిటికిలో కూర్చుండి గాఢనిద్రపోయి, పౌలు చాలాసేపు ప్రసంగించుచుండగా నిద్ర భారము వలన జోగి, మూడవ అంతస్తునుండి క్రిందపడి చనిపోయిన వాడై యెత్తబడెను. పౌలు అయౌవనస్థుని బ్రతికించినట్లుగా .అ.పొ.కా.20 అధ్యాయము లో చూడగలం. మరియు త్రోఫిము రోగియైనందున అతని మిలేతులో విడిచివచ్చితిని అని II తిమోతి 4:20 లో చెప్పబడుతుంది. మరియు "ఇక మీదట నీళ్లే త్రాగక నీకడుపు జబ్బు నిమిత్తమును తరుచుగా వచ్చు బలహీనతల కోసరమును ద్రాక్షరసము

కొంచెముగా పుచ్చుకొనుము అని 1తిమోతి 5:23 లో వ్రాయబడి యున్నది. మరియు నా సహోదరుడును, జతపనివాడును, నాతోడి యోధుడును, మీదూతయు, నా అవసరమునకు ఉపచరించిన వాడునైన - ఎపఫ్రొదితును మీ యొద్దకు పంపుట అగత్యమని అనుకొంటిని. అతడు రోగి యాయెనని మీరు వింటిరి గనుక అతడు మిమ్మునందరిని చూడ మిగుల ఆపేక్షగలవాడై విచార పడుచుండెను. నిజముగా అతడు రోగియై చావునకు సిద్ధమైయుండెను గాని దేవుడతనిని కనికరించెను; అతని మాత్రమే గాక నాకు దు:ఖము కలుగకుండుటకై నన్నును కనికరించెను. అని ఫిలిప్పీయులకు 2:25-27లో వ్రాయబడియున్నది.

పై లేఖనముల బట్టి మనము గమనించితే త్రోఫిము రోగియై నందున మిలేతులో విడిచెను, మరియు తిమోతి కడుపు జబ్బు నిమిత్తము పౌలు .తన సహోదరులయొద్ద వారిని విడిచిపెట్టెను అని లేఖనము స్పష్టముగా చూడగలం. అంటే అప్పటికే "స్వస్థతలు" ఆగిపోయినట్లు మనకు అర్థమౌతుంది. అద్భుత స్వస్థతలు జరుగుచున్నట్లయితే పౌలు తిమోతిని, త్రోఫిమును విడిచెట్టే వాడు కాదు. ఎపఫ్రొదితును అయితే దేవుడే స్వస్థత పరిచినట్లుగా చూడగలం.

"ప్రేమ శాశ్వత కాలముండును. ప్రవచనములైనను నిరర్థకమగును. భాషలైనను నిలిచిపోవును; జ్ఞానమైనను నిరర్థకమగును; మనము కొంతమట్టుకు ఎరుగుదుము, కొంతమట్టుకు ప్రవచించుచున్నాము గాని పూర్ణమైనది వచ్చినప్పుడు పూర్ణము కానిది నిరర్థకమగునని 1కొరింధి 13:8-9 లో వ్రాయబడి యున్నది.

ప్రియులారా ! పై లేఖనములు బట్టి "ఈనాడు అద్భుత స్వస్థతలు" అనేది మనుష్యుల వలన జరిగే పని మాత్రం కాదు. దేవుడే కనికరించాలి. అటువంటి భ్రమలో ఉండిన యెడల ఈరోజే సత్యమును చేపట్టుటకు నీవు యేసుదేవుని కుమారుడని విశ్వసించి, మారు మనస్సు పొంది,బాప్తిస్మము పొందిన యెడల నీవు రక్షింపబడుదువు. నిర్ణయము నీదే !

**A. గోపాలకృష్ణ, కాకినాడ**

# సంక్షిప్త వార్తలు

2006 జూలై 4,5 తేదీలలో రిక్కీగూటం దంపతులు ప్రకాశం జిల్లా ఒంగోలు ప్రాంతములో పర్యటించిరి. ఒంగోలుకు 15 కిలోమీటర్ల దూరములో యున్న మర్లపాడు గ్రామములో స్థానిక క్రీస్తు సంఘము ఏర్పాటు చేసిన సువార్త కూటములో వాక్యపరిచర్య చేసిరి. మర్లపాడులో సోదరుడు కె.జాషువాగారు వాక్య పరిచర్యచేయుచున్నారు. రిక్కీ గారు ఆ గ్రామమును దర్శించుట వలన స్థానిక సంఘము బహుగా ఆనందించిరి.

జూలై 13వ తేదీ గురువారం సత్యవాణి క్రీస్తుసంఘ ఆవరణలో యువకుల కూడిక జరిగెను. ఆ కూడికకు కాకినాడలోను, పట్టణమునకు సమీపములో యున్న ఆయా స్థానిక సంఘములలోను యున్న యువతీయువకులు హాజరై మంచి ఆత్మీయ సహవాసములో పాలు పొందిరి. నాటి కూడికలో రిక్కీ గూటం గారితో బాటు సోదరులు పి.జాన్‌మోజెస్ (ఇంద్రపాలెం) గారు కూడ వాక్యపరిచర్య చేసిరి. స్థానిక సంఘము ఏర్పాటు చేసిన అల్పాహారముతో కూటము ముగిసెను.

జూలై 14 నుండి 17 వరకు రిక్కీగారు హైదరాబాద్‌లో యుండిరి. 16వ తేదీ ఆదివారం నారాయణగూడ YMCA ఏరియాలో యున్న క్రీస్తు సంఘమును దర్శించి ఆరాధనలో పాల్గొనిరి. ఫారెస్ట్ ఆఫీసర్ కె.యస్.రావుగారి ప్రోత్సాహము వలనను, వినోద్ గారి వాక్యపరిచర్యవలనను YMCA లో కూడుకొనుచున్న సంఘము ప్రభువు పనిలో ముందుకుపోవుచున్నారు. YMCA లో ప్రతి ఆదివారం సాయంత్రం 4 గంటలకు క్రీస్తు సంఘ ఆరాధన జరుగుచున్నది.

జూలై 24వ తేదీ సోమవారం రాత్రి అనపర్తి మండలం పొలమూరుపాడులో జరిగిన సువార్త కూటమునకు రిక్కీ గూటం దంపతులు హాజరై స్థానిక సంఘమును బలపర్చిరి. రిక్కీగారు వాక్యపరిచర్య చేసిరి. సోదరులు కె.జయానంద్ గారు అక్కడ పలు సంవత్సరాలుగా వాక్యపరిచర్య చేస్తు క్రీస్తు కొరకు మంచి పనిచేయుచున్నారు. ఆ కూటమునకు కొప్పవరం గ్రామములో పనిచేయుచున్న సోదరులు పి.రాజు గారు కూడ హాజరై కార్యక్రమములో పాల్గొనిరి.

జూలై 28వ తేదీ శుక్రవారం విశాఖజిల్లా పాయకరావ్‌పేటలో యున్న ప్రకాశ్ ఆనంద్ కోలనీలో రిక్కీగారు వాక్యపరిచర్య చేసిరి. అక్కడ గోగాడ జాన్ గారు పనిచేయుచున్నారు.

జూలై 29వ తేదీ శనివారం పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలం తామరాడలో ఏర్పాటు చేయబడిన కూటములో రిక్కీ గారు వాక్యపరిచర్య చేసిరి. ముగ్గురు క్రీస్తు లోనికి బాప్తిస్మము పొందిరి. తామరాడలో సోదరులు గోసాల చిట్టిబాబుగారు వాక్యపరిచర్య చేయుచున్నారు.

జూలై 30వ తేదీ ఆదివారం తూర్పుగోదావరి జిల్లా ప్రత్తిపాడులోను, రౌతులపూడిలోను జాషువా గూటం గారి ఆధ్వర్యమున నిర్మించబడిన క్రీస్తు సంఘ నూతన ఆలయములను సోదరులు రోయస్ ఫ్రెడరిక్ గారు రిబ్బను కత్తిరించి ప్రతిష్టించిరి. ప్రత్తిపాడులో ముగ్గురు క్రీస్తు లోనికి బాప్తిస్మము పొందిరి. శ్రీకాకుళం నుండి వచ్చిన సోదరులు ఆర్.సి.హెచ్. సద్గుణరావు గారు కూడ ఈ సంతోష కార్యక్రమములలో పాల్గొని ఆనందించిరి.

RNI Regd. No. 6997/98
Postal Regd. No. AP/KD-02/2006-2008

To

From:

**SATYA VAKKU**
**P.O. Box 80, Kakinada - 533 001**

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambhamurthy St. Kakinada - 533 004

CMYK